# జోరుగా యాసంగి పనులు

ఎన్నో ఆశలు, మరెన్నో ఊసులు ఏదో మూల భయం వెరసి యాసంగి సాగుకు రైతన్న హలం పట్టాడు. వానాకాలం మిగిల్చిన కన్నీటి నష్టాలను పూడ్చుకుందామని రైతులు యాసంగికి సిద్ధమయ్యారు. సమృద్ధిగా కురిసిన వర్షాలకు నీరు పుష్కలంగా ఉండటంతో ముమ్మరంగా వరి నాట్లు వేస్తున్నారు. పత్తి వేసిన స్థానంలో మొక్కజొన్నను విరివిరిగా సాగు చేస్తున్నారు. మండలంలో ఏగ్రామంలో చూసినా యాసంగి పనుల్లో రైతులు బిజీగా కనిపిస్తున్నారు.

– మొగుళ్లపల్లి

- ఊపందుకున్న వరినాట్లు
- ముమ్మరంగా మొక్కజొన్న సాగు
- వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు


నాటు వేస్తున్న మహిళలు


నారు మోస్తున్న రైతు

వానాకాలం సీజన్ ముగిసి యాసంగి ప్రారంభమైంది. యాసంగిలో మండలంలోని అన్నదాతలు ప్రధానంగా వరి పంటలను అధికంగా సాగు చేస్తున్నారు. మొక్కజొన్న ఇతర పంటలను ఇప్పటికే చాలా చోట్లు సాగు చేశారు. మండలంలో 6 వేల ఎకరాల్లో వరి, 3 వేల ఎకరాల్లో మిగతా పంటలను సాగు చేయనున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

**యాసంగిపైనే రైతుల ఆశలు**

మండలంలోని మొగుళ్లపల్లి, రంగాపురం, వేములపల్లి, మొట్లపల్లి, ఇస్సిపేట, తదితర గ్రామాల్లో రైతులు, కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వానాకాలం సీజన్‌లో ఆకాల వర్షాలు చీడపీడలతో రైతులకు కలిసిరాలేదు. దీంతో చేసిన అప్పులు తీర్చాలనే పట్టుదలతో యాసంగిపైనే ఆశలు పెంచుకున్నారు. ముఖ్యంగా బోర్లు, బావులు, చెరువుల కింది రైతులు వరినాట్లు వేసేందుకు పొలాన్ని దున్నుతున్నారు. కొన్ని చోట్ల నాట్లు వేస్తున్నారు. అలాగే నీటి పారుదల సౌకర్యం లేని రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపుతున్నారు.

**మొక్కజొన్నపై ఆసక్తి**

సమృద్ధిగా కురిసన వర్షాల కారణంగా నీటి వనరులైన చెరువులు, బావులు, బోర్లలో నీరు పుష్కలంగా ఉండడంతో రైతులు పత్తి స్థానంలో మొక్కజొన్న వేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అప్పులు తెచ్చి పత్తిపంటను సాగు చేయగా ప్రతికూల వాతావరణంతో, వర్షాల కారణంగా పత్తి పంటలు పూర్తిగా దెబ్బతినడంతో అప్పులను పూడ్చుకునేందుకు ప్రత్యామ్నయంగా మొక్కజొన్న వేస్తున్నారు. మొక్కజొన్న పంటలో పంట ఆరంభంలో కత్తెర పురుగు పంటను ఆశిస్తుంది. కావున ఆ పురుగును నివారిస్తే అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. వానాకాలంలో పండిన మక్కలు తడిసి మద్దతు ధర పూర్తిగా పడిపోవడంతో తీవ్ర నష్టాలను రైతులు ఎదుర్కొన్నారు. కనీసం యాసంగిలోనైన మొక్కజొన్నతో లాభసాటి కలుగుతుందని ఆశతో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.

**పెట్టుబడి రాలేదు..**



వానాకాలం రెండు వరిపంట వేసినా అష్టకష్టాలు పడి పండించాం. పంట చేతికి వచ్చే సమయానికి వర్షాల కారణంగా పంట దిగుబడి తగ్గింది. పెట్టుబడి పెట్టిన డబ్బులు కూడా రాలేదు. ప్రస్తుతం యాసంగి పనులు మొదలుపెట్టాం. ఈ సరైన లాభం వస్తుందని ఆశిస్తున్నా.

– అరికంతపు అన్నారెడ్డి, రైతు, మొగుళ్లపల్లి

**మొక్కజొన్న సాగుచేశా..**



వర్షాకాలం మూడు ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా సరైన దిగుబడి రాలేదు. దీంతో పత్తి పంటను తీసేసి రెండు ఏకరాల్లో మొక్కజొన్నను వేశాను. పత్తిలో వచ్చిన నష్టాన్ని మొక్కజొన్నతోనైనా తీర్చుకోవాలి.

– వీరమల్లు, రైతు, మొగుళ్లపల్లి

## క్రీడలకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట


జెర్సీలు అందజేస్తున్న వెంకటేష్‌గౌడ్

చిట్యాల: క్రీడలకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్‌గౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని క్రికెట్ క్రీడాకారులకు ఆయన ఆదివారం జెర్సీలు అందజేసి మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి ఆదేశాల మేరకు జెర్సీ అందించినట్లు తెలిపారు. క్రీడాకారులను భారతీయ జనతా పార్టీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిరంతరం ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని క్రీడాకారులు క్రీడారంగంలో రాణించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా ఇన్‌చార్జ్ గుండ మణికుమార్, క్రీడాకారులు వేల్పుల రాజు, లవన్, బాబు, రాజేష్, కట్కూరి రాజేందర్, సృజన్, మహేష్, అఖిల్, శివ, రాజు, వెంకటేష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టులకు సహకరించొద్దు


పలిమెల: మాట్లాడుతున్న ఎస్సై అరుణ్


ఏటూరునాగారంలో..

పలిమెల: ప్రజలు మావోయిస్టులకు సహకరించొద్దని ఎస్సై అరుణ్‌కుమార్ అన్నారు. మండంలోని దమ్మూరులో కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా ఆదివారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం గ్రామస్తులతో ఎస్సై మాట్లాడుతూ.. గ్రామంలో కొత్తగా, అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. యువత వారి విద్యార్హతలు బట్టి ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్లకు దరఖాస్తు చేసుకొని మంది భవిష్యత్ పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

**మావోయిస్టులకు ఆశ్రయం ఇవ్వొద్దు**

ఏటూరునాగారం: మావోయిస్టులకు ప్రజలు ఆశ్రయం ఇవ్వొద్దని సీఐ మండల రాజు అన్నారు. మంగపేట మండలంలోని ముసలమ్మ గుట్ట గొత్తికోయగూడెంలో ఆదివారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. తెల్లవారుజామున ఎస్సై రవికుమార్, మంగపేట పోలీసు సిబ్బందితో కలిసి గూడెంలో తనిఖీలు చేపట్టారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వాళ్లు వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. చిన్నారులకు బిస్కెట్లు, ఆహార పదార్థాలను అందజేశారు.

## అట్టహాసంగా 'గొంతెమ్మ గుట్ట' జాతర


జాతరకు హాజరైన భక్తులు


మొక్కులు చెల్లించుకుంటున్న పుట్ట మధు

కాటారం: ప్రాచీన చారిత్రాత్మక, దైవసంబంధిత ఆనవాళ్లు కలిగిన మండలంలోని ప్రతాపగిరి గొంతెమ్మ గుట్టపై నిర్వహించిన జాతర ఆదివారం అట్టహాసంగా కొనసాగింది. పాండవుల బేరి వద్ద పట్నాలు వేసి లక్ష్మీదేవరకు పూజలు చేశారు. పలు గ్రామాల నుంచి వచ్చిన లక్ష్మీదేవర బృందాలు ఆడిపాడాయి. శివసత్తులు పూనకాలతో ఊగిపోగా భక్తులు బోనాలు వండి మొక్కులు సమర్పించారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తుల రాకతో గుట్ట ప్రాంతం నిండిపోయింది. పెద్దపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ పుట్ట మధు, బీఆర్‌ఎస్ యువజన నాయకుడు జక్కు రాకేశ్, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి, టీఆర్‌ఎస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట జనార్దన్, వేమునూరి ప్రభాకర్‌రెడ్డి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీపాట ట్రస్టు ఆధ్వర్యంలో మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ, జాతర కమిటీ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## నిధుల మంజూరుకు కృతజ్ఞతలు


పుట్ట మధును కలిసిన సర్పంచ్, గ్రామస్తులు

మల్హర్: మండలంలోని దుబ్బపేట గ్రామానికి రూ.90లక్షల నిధులను ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి మంజూరు కృషి చేసినందుకు సర్పంచ్ అజ్మీర ప్రమీల రాజ్‌నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు మంథనిలో పుట్ట మధు నివాసంలో ఆయనను ఆదివారం గ్రామస్తులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్‌ఎస్‌పార్టీ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, నాయకులు యాదగిరిరావు, రవీందర్, రాజుకుమార్, సుధాకర్ గ్రామస్తులు ఉన్నారు.

## ప్రొటోకాల్ కల్పించాలని వినతి


భూపాలపల్లి రూరల్: ఎమ్మెల్సీ కవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: ప్రభుత్వ కార్యక్రమాల్లో కోఆప్షన్ సభ్యులకు ప్రొటోకాల్ కల్పించాలని రాష్ట్ర మండల కోఆప్షన్ ఫోరం అధ్యక్షుడు ఎండీ రాజ్‌మహ్మద్ కోరారు. ఈ మేరకు బీజీకేఎస్ నూతన భవన ప్రారంభానికి వచ్చిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితకు ఆదివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవితను పూలమాలతో సత్కరించారు.

**వినతిపత్రం అందజేసిన ఉపాధ్యాయులు**

భూపాలపల్లి అర్బన్: భాషోపాధ్యాయులకు పదోన్నతలు కల్పించాలని కోరుతూ.. రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతలతో పాటు భాషా పండితులకు ప్రమోషన్లు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు దిల్షాద్, సునీల్‌కుమార్, కవరాజ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## బొడ్రాయి ప్రతిష్ఠాపనకు భూమిపూజ


భూమి పూజలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

టేకుమట్ల: మండల కేంద్రంలో ఫిబ్రవరి 1 నుంచి మొదలయ్యే భూలక్ష్మీ, మహాలక్ష్మీ–బొడ్రాయి ప్రతిష్ఠాపనకు సర్పంచ్ పొలాల సరోత్తంరెడ్డి, ఎంపీటీసీ ఆది రఘు ఆదివారం భూమిపూజను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో గ్రామ దేవతల పునఃప్రతిష్ఠాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. దశాబ్దాల అనంతరం గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అందుకు సర్వం సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, ఉప సర్పంచ్ నిమ్మల స్వామి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులు అమానుషం


భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు

భూపాలపల్లి రూరల్: అక్రమ అరెస్టు చేయడం అమానుషం అని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కవిత భూపాలపల్లి పర్యటనలో భాగంగా శనివారం రాత్రి నుంచి జిల్లాలోని అన్ని మండలాల నుంచి కాంగ్రెస్ పార్టీ, కార్యకర్తలను, ఎన్‌ఎస్‌యూఐ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రశ్నించే గొంతుకలను నొక్కిపెట్టడం సరికాదన్నారు. బీఆర్‌ఎస్ నాయకుల ఆగడాలను ప్రజలు గమనిస్తున్నారని రానున్న రోజుల్లో ఆ పార్టీకి పతనం తప్పదన్నారు.

## క్రీడల్లో గెలుపు ఓటములు సహజం


నేరేడుపల్లి జట్టుకు షీల్డ్ అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

చిట్యాల: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలని, గెలుపు ఓటములు సహజమని చిట్యాల, టేకుమట్ల జెడ్పీటీసీలు గొర్రె సాగర్, పులి తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలోని జడల్‌పేట గ్రామంలో మాజీ సర్పంచ్ నల్ల సమ్మిరెడ్డి స్మారకార్థం జిల్లాస్థాయి క్రికెట్ క్రీడోత్సవాలు నిర్వహించారు. కాగా ఆదివారం ముగింపు సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహభావం పెరుగుతుందన్నారు. అనంతరం ప్రథమ స్థానంలో నిలిచిన నేరేడుపల్లి జట్టుకు రూ.10,116 నగదుతో పాటు షీల్డు, అలాగే ద్వితీయ బహుమతి చిట్యాలకు రూ.50116 నగదుతో పాటు షీల్డు అందించారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు క్రీడాకారులను అభినందించారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు కామిడి రత్నాకర్‌రెడ్డి, ఎంపీటీసీ బొమ్మనపల్లి వనమ్మ, నాయకులు కట్కూరి నరేందర్, బండారి శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ పాకల వనమ్మ వీరారెడ్డి, నల్ల దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## కూలీగా సబ్ రిజిస్ట్రార్ తస్లీమా


నాటు వేస్తున్న తస్లీమా


కూలీలతో కలిసి భోజనం చేస్తున్న తస్లీమా

వెంకటాపురం(ఎం): అన్నదాతలు సమాజానికి స్ఫూర్తి ప్రదాతలని ములుగు, భూపాలపల్లి జిల్లాల సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ అన్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో ఆమె మండలంలోని పాలంపేటలోని రైతు శ్రీను–స్వప్న దంపతులు వ్యవసాయ పొలంలో కూలీలతో కలిసి నాట్లు వేశారు. మధ్యాహ్నం మహిళ కూలీలతో కలిసి పొలంనే భోజనం చేశారు. రోజంతా పని చేసినందుకు గాను సదురు రైతు ఆమెకు రూ.250 కూలి ఇచ్చారు. ఈ సందర్భంగా తస్లీమా మాట్లాడుతూ.. వ్యవసాయం చేసేందుకు రైతులు ఎండనక, వాననక కష్ట పడుతున్నారని అన్నారు. రైతులకు మేమున్నామనే భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు.

**సన్మానం**


ప్రకాష్‌ను సన్మానిస్తున్న నాయకులు

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామానికి వచ్చిన తెలంగాణ వాటర్ రిసోర్స్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ ప్రకాష్‌రావును పీఏసీఎస్ చైర్మన్ మల్క ప్రకాష్‌రావు, నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు సుంకు రాము, మల్క రాజేశ్వర్‌రావు, మంథని మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేవర్నేని రాజేశ్వర్‌రావు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధికార ప్రతినిధి బండి రాజయ్య, మండల ప్రధాన కార్యదర్శి బూడిద మల్లేష్, ఉపాధ్యక్షుడు సాంబయ్య, పడితెల లింగరావు తదితరులు పాల్గొన్నారు.

**పుస్తకాలు, బ్యాగుల పంపిణీ**

మహదేవపూర్: మండలంలోని పెద్దంపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు సీఆర్‌పీఎఫ్ పోలీస్ ఆధ్వర్యంలో బుక్కులు, పెన్సిల్, పెన్నులు, బ్యాగులు అందజేశారు. అలాగే అంబడిపల్లి గ్రామపంచాయతీకి వాలీబాల్ నెట్, బాల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజకుమార్, సీఆర్పీఎఫ్ సీఐలు రమణారెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

**అనాథలను ఆదుకోవాలి**


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అనాథలను ఆదుకోవాలని జిల్లా కేంద్రానికి వచ్చిన రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌కు మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) ఆధ్వర్యంలో ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు చంద్రమౌళి, జిల్లా కన్వీనర్ గట్ల రాజన్నలు మాట్లాడుతూ. అనాథలు పడుతున్న బాధలను వారి స్థితిగతులను మంత్రికి వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బట్టు విజయ్, నోముల శ్రీనివాస్, సురేష్, భిక్షపతి పాల్గొన్నారు.

## గుడిసెవాసులకు అండగా సీపీఎం


మాట్లాడుతున్న తుమ్మల వెంకట్‌రెడ్డి

ములుగు రూరల్(గోవిందరావుపేట): ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ప్రభుత్వం పట్టాలు అందించే వరకు సీపీఎం పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం గుడిసెవాసులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గోవిదంరావుపేట మండలం పస్రా నాగారం పరిధిలోని 109 సర్వే నంబర్ భూమిని భూస్వాములు కబ్జా చేసే ప్రయత్నం చేశారని వారికి సీపీఎం పార్టీ అడ్డుకుందని అన్నారు.పొదిళ్ల చిట్టిబాబు, కడారి నాగరాజు, అంబాల పోషాలు, చంద్రారెడ్డి ఉన్నారు.

## క్లుప్తంగా

### రేపు కబడ్డీ టోర్నమెంట్

మహాముత్తారం: మండలంలోని నల్లగుంటమీనాజీపేటలో అనసూయమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 24న కాటారం డివిజన్ పరిధిలోని ఐదు మండలాలా కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన క్రీడాకారులకు మొదటి బహుమతి రూ.10వేలు, రెండవ బహుయతి రూ.5వేలు ఉంటుందన్నారు. ఎంట్రి ఫీజు రూ.500 చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలకోసం 93477 93230, 70131 83497 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

చిట్యాల: మానేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా జడల్‌పేట శివారు వద్ద ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం .. ఆదివారం ఉదయం జడల్‌పేట శివారు వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా నైన్‌పాక నుంచి జడల్‌పేటకు ఇసుక లోడు ట్రాక్టర్ ఏలాంటి అనుమతి పత్రాలు లేకుండా రవాణా చేస్తుండగా పట్టుకున్నట్టు తెలిపారు. ఈ మేరకు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్ బానోత్ వీరుతో పాటు యాజమాని పట్టెం కోటిలింగంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### పరామర్శ

కాటారం: మండలంలోని ఒడిపిలవంచకు చెందిన పోట సమ్మక్క, గుమ్మాళ్లపల్లికి చెందిన దేవన్న ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను బీఆర్‌ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్టమధు ఆదివారం పరామర్శించారు. అలాగే ఒడిపిలవంచలో అనారోగ్యంతో బాధపడుతున్న శేఖర్‌ను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు జక్కు రాకేశ్, నరివెద్ది శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

### నివాళి



మహదేవపూర్: మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ కోట రాజబాబు తల్లి కోట లచ్చమ్మ (80) ఆదివారం ఉదయం మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు పరామర్శించి లచ్చమ్మ మృత దేహం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### అడవి గేదె మృతి




పలిమెల: మండలంలోని పంకేనలో ఆదివారం ఉదయం అడవి గేదె మృతి చెందినట్లు రేంజ్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. రేంజ్ అధికారి తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం మిర్చి చేనుకు వెళ్లిన కూలీలకు గేదె కనిపించడంతో గేదెను బెదిరించి చేను నుంచి వెలగొట్టే ప్రయత్నం చేయగా కొంత దూరం వెళ్లి పడిపోయింది. దీంతో అది గాయాలతో ఉందని గమనించిన గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు వచ్చి దున్నను ప్రథమ చికిత్స చేస్తుండగా మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. అయితే మృతిచెందిన గేదెకు అధికారులు పంచనామా నిర్వహించి దహన సంస్కారాలు నిర్వహించినట్లు తెలిపారు. కాగా అడవి గేదె సాధారణ మృతి చెందినట్లు తెలిపారు. అయితే కొద్ది రోజుల క్రితం ఈ గేదెను మదరో గేదే పొడవటంతో గాయమైనట్లు తెలిపారు.

### బియ్యం అందజేత

ఏటూరునాగారం: మండలంలోని శంకరాజుపల్లి గ్రామానికి చెందిన తాటిపెల్లి దుర్గయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని సర్పంచ్ అనుముల శకుంతల ముకుందరావు ఆదివారం పరామర్శించి 50కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో శంకరాజుపల్లి బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆత్కూరి రాంబాబు, దేవులపల్లి సమ్మయ్య, వల్స భిక్షపతి, లొటపెటల రాజేష్, తీగల చంద్రం, నూకల లక్ష్మీనారాయణ, అంతటి సంతోష్, సాయిని చేతన్, అనుముల రమేశ్, జాడి దుర్గారావు, తాటిపెల్లి రాజయ్య, తాటిపెల్లి సురేష్, కొండగొర్ల చంద్రమౌళి పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌లో చేరిక



వాజేడు: బీఆర్‌ఎస్ పార్టీలో ఏడ్జర్లపల్లి ముత్తారం కాలనీకి చెందిన 25 కుటుంబాలు చేరాయి. నూగూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి సమక్షంలో పలు పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.